క్లుప్తంగా

చిత్రకారుడు మధుసూదన్‌కు సత్కారం



నెహ్రూనగర్: నగరానికి చెందిన చిత్రకారుడు మధుసూదన్‌ను మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అభినందించారు. హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో ఈ నెల 9న కళాకారులకు నిర్వహించిన అవార్డ్స్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మధుసూదన్ పేరును నమోదు చేయడంతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మేయర్‌ను సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో చిత్రకారుడు మధుసూదన్ కలిశారు. మేయర్ ఆయన్ను సత్కరించి అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లో మధుసూదన్ మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన మొదటి వ్యక్తి అని పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎందరికో శిక్షణ ఇచ్చి చిత్రకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో బుధవారం సోమంచి అన్నపూర్ణశాస్త్రి స్మారక ఉపకార వేతనాల్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాత గుంటూరు బ్రాంచి హైస్కూల్లో 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన కె. లిల్లీప్రియ, ఎస్‌కే అబ్దుల్ వదుత్ నగదు ప్రోత్సాహకాల్ని అందజేశారు. పాఠశాల కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావం కలిగిన ఉపాధ్యాయుడిగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అన్నపూర్ణశాస్త్రి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నపూర్ణశాస్త్రి పేరుతో వారి కుమారులు, మనుమలు భూరీ ఉపకార వేతనాల్ని అందించడం ముదావహమన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి ఉపకార వేతనాలు ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగినికి చార్జ్ మెమో

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగినికి నగర కమిషనర్ కీర్తి చేకూరి మెమో చార్జ్ మెమో జారీ చేశారు. వివరాలు.. నగరపాలక సంస్థలో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ గత నెలలో రెవెన్యూ విభాగంలో ఏ-2గా కేటాయించిన బాధ్యతలు స్వీకరించకుండా, అధికారుల అనుమతి లేకుండా ఎల్.శ్రీదేవి ఫేక్ మెడికల్ సర్టిఫికెట్‌తో దీర్ఘకాల సెలవులో వెళ్లారు. కేటాయించిన బాధ్యతలు తీసుకుకోకపోవడం, ఉన్నత అధికారులకు ఎటువంటి సమాచారం అందించక పోవడం వల్ల నగర పాలక సంస్థ ఆదాయ వనరులకు భంగం వాటిల్లింది. నగరంలో గడవు ముగిసిన ఆశీలు రెన్యువల్ జాప్యంపై ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చకు వచ్చింది. ఇందుకు కారణమైన శ్రీదేవి వ్యవహారశైలిపై కమిషనర్ అదనపు కమిషనర్‌ని విచారణకు ఆదేశించారు. సదరు మెడికల్ సర్టిఫికెట్లను తనిఖీ నిమిత్తం మెడికల్ బోర్డ్‌కు పంపారు. అవి నకిలీవని బోర్డ్ నివేదిక ఇచ్చింది. కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించిన శ్రీదేవిపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ రూల్స్-1991 ప్రకారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చార్జిమెమో జారీ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల్లో రాతపూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: నగరంలో మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం అధిక ప్రాధాన్యతనిస్తోందని పార్టీలకతీతంగా నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. కృష్ణబాబు కాలనీలో రూ.1.66 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్ని కుల, మత, పార్టీలకతీతంగా అందజేస్తున్నారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని నగరంలో అభివృద్ధి పనుల్ని పారదర్శకంగా కుల, మత, పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధికి ధృఢ సంకల్పంతో ఉన్నామని స్పష్టం చేశారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రతి డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. డివిజన్లలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్దేశిత గడువు మేరకు కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు కూడా పనుల్ని పర్యవేక్షణ చేయాలని మేయర్ సూచించారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంతలూరుగా మార్చిందని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నగరాభివృద్ధి శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాంద్రకుంట గురవయ్య, అందుగల సంతోష్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

ప్రజా సమస్యల్ని సత్వరమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది త్వరితగతిన స్పందించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. నియోజకవర్గంలోని పదో డివిజన్, జున్ను సైదానగర్‌లో డ్రెయినేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బుధవారం తెలుసుకున్న ఎమెల్యే ముస్తఫా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలోనే ఉండి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేలా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్లు మీరావలి, సంకూరి శ్రీను, అజయ్ యాదవ్, మెహమూద్, అధికారులు, వైఎస్సా సీపీ నేతలు పాల్గొన్నారు.



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మెరుగైన ర్యాంకు కోసం ఓటెయ్యండి

- స్వచ్ఛ సర్వేక్షణ్- 2023కి సహకరించాలి
- కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో నగరానికి మెరుగైన ర్యాంక్ కోసం ఓట్ ఫర్ యువర్ సిటీకి నగర ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా నగరపాలక సంస్థ సంస్థాగతంగా పారిశుద్ధ్య పనులు చేపడుతోందని తెలిపారు. ప్రజలంతా తమ అభిప్రాయాల్ని ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియజేయాలని ఆమె సూచించారు. నగరంలోని 206 వార్డ్ సచివాలయాల పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి వచ్చినందున నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నగర సుందరీకరణలో భాగంగా మెయిన్ రోడ్ల డివైడర్లు, ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల వద్ద పెయింటింగ్ చేయించామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకమని వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నగరవాసులు నేరుగా mygovpatgorm, rwacchata app, rr2023 vote for your city app, rr2023 vote for yo ur city web ల ద్వారా తెలపాలని సూచించారు. ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాల్ని చెప్పాలని కోరారు. ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే నిర్వహించే ఓటింగ్ అని, ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆమె తెలిపారు. ప్రజారోగ్య కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్‌ల వినియోగం, ఓటీపీ అంశాలపై అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

సీటీఎస్ విభాగ వైద్యులపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆగ్రహం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ బుధవారం గుండె శస్త్రచికిత్స చేసే సీటీఎస్ వైద్య విభాగాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆపరేషన్లకు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో ఇద్దరికి ఆపరేషన్లు చేస్తుంటే, సీటీఎస్ వైద్యులు కనిపించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండగా, కాంట్రాక్టు వైద్యుడు ఎందుకు ఆపరేషన్లు చేయాల్సి వస్తోందని సీటీఎస్ వైద్య విభాగాధిపతి డాక్టర్ మోతీలాల్‌ను ప్రశ్నించారు. వైద్య విభాగంలో తన మాట ఎవరూ వినడం లేదని ఆయన వివరణ ఇవ్వడంతో తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కాంట్రాక్టు వైద్యుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య విభేదాలు ఉన్న విషయాన్ని ఆయన తనిఖీల్లో గుర్తించారు. వైద్యులంతా విభేదాలు పక్కనపెట్టి గుండె జబ్బు రోగుల ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. వైద్యుల కోసం గదులు, కూర్చునేందుకు సరైన బల్లలు, కుర్చీలు సరిగా లేకపోవడంతో తక్షణమే వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి రాని వస్తువులను వర్క్‌షాప్‌కు తరలించి, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.అనంతరం 24 గంటల ఆపరేషన్ థియేటర్, ఒకే ఆపరేషన్ థియేటర్ ఉండటం వల్ల రోగులు నష్టపోతున్నారని, త్వరలో రెండో థియేటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన వైద్య పరికరాల్ని వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. న్యూరో సర్జరీలో ఐసీయూ పరిశీలించారు. రోగుల సహాయకులు ఎక్కువ మంది ఉండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.



స్లాబ్ వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఎంసీహెచ్ రెండో స్లాబ్ నిర్మాణానికి ప్రత్యేక పూజలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) రెండో స్లాబ్ నిర్మాణానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారం, మంత్రి విడదల రజిని చొరవతో సుమారు రూ. 86 కోట్లతో జింఖానా ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేస్తోందని చెప్పారు. వచ్చే ఏడాది కల్లా ఎంసీహెచ్ వార్డును అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. 600 పడకలతో రాష్ట్రంలోనే అతి పెద్ద మాతా శిశు సంరక్షణ కేంద్రంగా గుంటూరు జీజీహెచ్ అవతరించబోతుందని ఆయన వెల్లడించారు.

నేడు, రేపు ఐటీ ఫైలింగ్‌పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ఆదాయపు పన్నుశాఖ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సంయుక్తంగా గురు, శుక్రవారాల్లో ఐటీ ఫైలింగ్‌పై ఉచిత అవగాహన, సలహా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ మద్ది రవితేజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు, పెన్షనర్లకు ఎంతో కీలకమైన ఐటీ ఫైలింగ్‌పై సందేహాలను నివృత్తి చేసేందుకు అనుభవజ్ఞులైన సీఏలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాసరావు పేట 60 అడుగుల రోడ్డులోని ఐసీఏఐ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే శిబిరంలో ఐటీ ఫైలింగ్‌పై జరిగే శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0863-2218915 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ముస్లిం యువతి వివాహానికి బీరువా బహూకరణ



చేబ్రోలు: పొన్నూరు పట్టణం ఒకటో వార్డులోని పేద కుటుంబానికి చెందిన షేక్ రసూల్ కుమార్తె వివాహానికి పొన్నూరు అంజుమన్ కమిటీ చేయూతనందించింది. ఇనుప బీరువాను బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేసింది. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మాము మాట్లాడుతూ పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ కరీముల్లా, డైరెక్టర్లు షేక్ హుస్సేన్, సయ్యద్ జిలాని, షేక్ షకీల్, పఠాన్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణానికి నిధుల మంజూరు



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని 25 వార్డులో నిలిచిపోయిన ముస్లిం షాదీఖానాను బుధవారం సంబంధిత జిల్లా అధికారులు పరిశీలించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య కృషితో జిల్లా కలెక్టర్ తరపున రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. బేస్ మట్టంలో ఆగిపోయిన నిర్మాణాన్ని, పిల్లర్స్‌ను గుంటూరు నుంచి వచ్చిన అధికారులు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, త్వరలో పనుల్ని చేపడతామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పట్టణ ముస్లింలకు ఇచ్చిన హామీల్లో ఆటోనగర్ ఏర్పాటు, 25 వార్డులో షాదీఖానా నిర్మాణాలు ఉన్నాయి. ఎట్టకేలకు షాదీఖానా నిర్మాణం పూర్తికి అడుగులు పడుతున్నాయి. హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు పొన్నూరు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మాము, కమిటీ సభ్యులు, 17 మసీదుల కమిటీల సభ్యులు, పొన్నూరు పట్టణ ముస్లిం మత పెద్దలు అభినందనలు తెలిపారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



చెక్కులు అందుకున్న పోలీసు కుటుంబాలతో ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం పలువురు పోలీసుల కుటుంబాలకు అధికారులు చెక్కులు అందజేశారు. పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించే వెంకట్రావు బ్రెయిన్ స్ట్రోక్‌తో గతనెల ఆరో తేదిన మృతి చెందారు. ఈ మేరకు విడోస్ఫ్లాగ్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కుని వెంకట్రావు భార్య శ్రీదేవికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. తెనాలి సబ్ డివిజన్ పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వర్తించే ఎ.శ్రీనివాసరాజు, మంగళగిరి పట్టణ పీఎస్ కానిస్టేబుల్ కె.మాధవరావు, నార్త్ సబ్ డివిజన్ మంగళగిరిలో హెచ్‌సీ పి.శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం శ్రీనివాసరాజు భార్య ప్రతిభారాణి, మాధవరావు భార్య స్వర్ణ, శ్రీనివాసరావు భార్య నాగమణిలకు రూ.1 లక్ష చెక్కులను ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, డీపీవో మినిస్ట్రీయల్ -బి సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూఎస్ఏకు చెందిన నార్త్ సౌత్ ఫౌండేషన్ రూ. 23,25,000 విలువగల చెక్కులను తమ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో అందించిందని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 94 మంది అర్హత కల్గిన ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కుల్ని అందించినట్లు తెలిపారు. ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్య సాధనకు గొప్ప వ్యక్తిత్వం, మానవ సంబంధాలు, వృత్తిపై గౌరవం, సామాజిక బాధ్యత, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో- ఆర్డినేటర్ లయన్ సూరపనేని వెంకటరత్నం మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు మంచి ఉద్యోగాలు చేయాలని ఆకాంక్షించారు. తమ వేతనంలో కొంత భాగం పేద విద్యార్థులకు అందించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్ద మొత్తంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన నార్త్ సౌత్ ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు తదితరులు నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధుల్ని శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.

మార్కెట్లోకి హ్యుండయ్ ఎక్స్టర్ ఎస్‌యూవీ విడుదల



కారును విడుదల చేస్తున్న ఎండీ సిద్ధార్థ్ తదితరులు

పాత గుంటూరు: ఆటోనగర్‌లోని కుశలవ హ్యుండయ్ షోరూంలో బుధవారం ఎక్స్టర్ ఫ్యామిలీ బడ్జెట్‌లో ఫుల్లీ లోడెడ్ ఎస్‌యూవీ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి సిద్ధార్థ్ మాట్లాడుతూ హ్యుండయ్ ఎస్‌యూవీ అత్యాధునిక టెక్నాలజీ, ఆరు స్టాండర్డ్స్ ఎయిర్ బ్యాగ్స్, 60కి పైగా కనెక్టివిటీ ఫీచర్స్‌తో ఫుల్లీ ఆటోమేటిక్ టెంపరేచర్ కంట్రోల్, క్రూస్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ స్టబిలిటీ కంట్రోల్, రెండు రకాల ఇంజన్లతో 1.2 లీటర్లు పెట్రోల్, 1.2 లీటర్లు బై ఫ్యూయల్ పెట్రోల్ ప్లస్ సీఎన్‌జీతో తయారైందని వివరించారు. ఇతర కంపెనీ కార్లకు దీటుగా, అందరికీ అందుబాటు ధరల్లో మార్కెట్‌లోకి వచ్చిందని తెలిపారు. హ్యుండయ్ ఎక్స్టర్ ప్రారంభ ధర రూ. 5,99,900, (ఎక్స్ షోరూం ధర)గా ఉందని చెప్పారు. టెక్స్ డ్రైవ్ కోసం సమీపంలోని కుశలవ హ్యుండయ్ షోరూంను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సేల్స్ సర్వీస్ డైరెక్టర్ చి. వెంకట రెడ్డి, ఏరియా సేల్స్ మేనేజర్ యం. నందకిశోర్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, చీఫ్ మేనేజర్ జాన్‌వెస్లీ, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై, తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం 2వ లైనుకు చెందిన విప్పె సాయికృష్ణ చరణ్ వ్యసనాలకు బానిసై గంజాయి విక్రయాలకు పాల్పడుతుంటాడు. విజయవాడలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి నగర శివారులో లింగాయపాలెం ప్లాట్ల వద్ద కూలీలు, డ్రైవర్లు, విద్యార్థులకు పొట్లం రూ. 400కు విక్రయిస్తుంటాడు. లింగాయపాలెం ప్లాట్లలో సాయికృష్ణ గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

గుంటూరు ఈస్ట్: విద్యుత్ ఘాతానికి గురై లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడుకు చెందిన మిరియాల శ్రీనివాస్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గుంటూరులోని అశోక్‌నగర్ 4వ లైనులో లారీని రోడ్డు పక్కన నిలిపాడు. కొంతసేపటి తర్వాత లారీ ఎక్కే క్రమంలో జోరు పైభాగం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ఇన్సూరెన్స్ ఏజెంట్‌పై కేసు నమోదు

వినియోగదారుల్ని మోసం చేసిన ఇన్సూరెన్స్ ఏజెంట్‌పై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులోని సోనోవిజన్‌లో తెనాలికి చెందిన శ్రీనివాస్, తాడికొండకు చెందిన కొల్లా ప్రమోద్ బజాజ్ ఇన్సూరెన్స్ ద్వారా గృహోపకరణాల్ని లోనులో కొనుగోలు చేశారు.వారి ఆధార్‌లు, కేవైసీ వివరాలు ఉపయోగించి ఉద్యోగి రాజేష్ రెండు టీవీలను తీసుకున్నాడు. బాకీ డబ్బులు చెల్లించాలంటూ కంపెనీ నుంచి శ్రీనివాస్, ప్రమోద్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వారు కంపెనీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బజాజ్ ఇన్సూరెన్స్ ప్రతినిధి సునీల్ బుధవారం రాజేష్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతకం ఫోర్జరీ

లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలో సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీరామ్ చిట్ ఫండ్స్‌లో ఫణీందర్ చీటీలు కడుతున్నాడు.అయితే, ఇటీవల శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ బాకీ చెల్లించమంటూ ఆయనకు నోటీసు వచ్చింది. కంపెనీకి వెళ్లి తాను ఏనాడూ పాలసీ కట్టలేదని, అయినప్పటికీ నోటీసులు ఎందుకు పంపించారంటూ ప్రశ్నించాడు. సిబ్బంది పాలసీకి సంబంధించిన సర్టిఫికెట్లు చూపించారు. ఫణీంద్రరెడ్డి పేరు మీద 2020లో రూ. లక్ష పాలసీ కట్టినట్లు ఉంది. అందులో ఫణీంద్రరెడ్డి తండ్రి సంతకం ఫోర్జరీ చేసి ఉంది. ఈ మేరకు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై దాడి

ఓ వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నార్నె టవర్స్‌లో నివసించే క్రాంతి కిరణ్ ఈనెల 9న నడుచుకుంటూ అపార్టుమెంట్ సమీపంలో వెళుతున్న సమయంలో పాత కక్షల నేపథ్యంలో శివ రామకృష్ణ వచ్చి గొడవ పడ్డాడు. క్రాంతి కిరణ్‌పై రాయితో దాడి చేశాడు. ఈ మేరకు అతడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఓ వ్యక్తి బావపై పోలీసు స్టేషన్ ప్రాంగణంలోనే కత్తితో దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు శ్రీనగర్‌కుచెందిన ఆర్.లోకేష్, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన కిలారి భార్గవి రెండు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. బుధవారం భార్గవి తల్లిదండ్రులు, సోదరుడు సతీష్‌లు శ్రీనగర్‌లోని లోకేష్ నివాసానికి వచ్చి గొడవ పడ్డారు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అందరూ స్టేషన్ లోపల నుంచి బయటకు వస్తున్న క్రమంలో భార్గవి సోదరుడు సతీష్ చాకుతో లోకేష్‌పై దాడి చేశాడు. పోలీసులు వెంటనే ఇద్దరినీ పక్కకు లాగి లోకేష్‌కు చికిత్స చేయించారు. సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : జేసీ

గుంటూరు రూరల్: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పదని ఉపాధ్యాయుల్ని జేసీ రాజకుమారి హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. విధుల్లో ఆలసత్వం వహించవద్దని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ కాలేజీల్లో చేరారో.. లేదో ? సమాచారం సేకరించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని "చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్"లో నమోదు చేసింది.. లేనిది? ఆరా తీశారు. ఇంకా నమోదు చేయని విద్యార్థులు ఉంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద నాణ్యత గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. జగనన్న విద్యాకానుక పంపిణీ వివరాలు, నాడు -నేడు పనుల పురోగతిపై సమీక్ష జరపాలని హెచ్‌ఎంని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, హెచ్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.